క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: కొత్తకోటలో ఆంజనేయస్వామి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. సాయంత్రం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సరుగుడు జలపాతం కళకళ


సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి

నాతవరం: సరుగుడు జలపాతం ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఎత్తైన రెండు కొండల నడుమ ప్రవహించే నీటిలో జలకాలు ఆడుతూ సరదాగా గడిపారు. ఉమ్మడి విశాఖతో పాటు తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతం కళకళలాడింది. ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సరుగుడుకు వెళ్లే మార్గంలో వాహనాల రద్దీ నెలకొంది.

70 మందికి నేత్ర వైద్య పరీక్షలు


వేచలంలో కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది

దేవరాపల్లి: మండలంలోని ఎస్.గజపతినగరంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 38 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి బస్సులో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైద్య నిపుణురాలు డా.దివ్య, ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, రెడ్డి శేషు మాష్టారు, క్యాంప్ కో–ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల కోసం ప్రత్యేక చలివేంద్రం


మూగజీవాల చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

కె.కోటపాడు : పదేళ్లుగా వేసవి సమయంలో మూగజీవాలకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న కుభిరెడ్డి రాధాకృష్ణ, వరలక్ష్మిలు అభినందనీయులని కింతాడ గ్రామానికి చెందిన రావాలమ్మ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ అన్నారు. కుంద్రపువానిపాలెంలో రాధాకృష్ణ ఇంటి పరిసరాల్లో ఏర్పాటు చేసిన మూగజీవాల చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. సామాజిక బాధ్యతతో ఇంటి పరిసరాల్లో పక్షులతో పాటు మూగజీవాలకు నీటిని ప్రత్యేక పాత్రలలో అందుబాటులో ఉంచుతూ వాటి దాహార్తిని తీర్చుతున్నట్లు రాధాకృష్ణ, వరలక్ష్మి తెలిపారు.

వారాడలో అగ్ని ప్రమాదం


చెట్లకు వ్యాపించిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కె.కోటపాడు : వారాడ గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. బొడ్డాన దేముడుకు చెందిన పశువుల పాక, యూకలిప్టస్ చెట్లు కాలిపోయాయి. మధ్యాహ్నం సమయంలో పాకకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. సమాచారం తెలుసుకున్న రైతు దేముడు, ఆయన కుటుంబ సభ్యులు వచ్చి మంటలను ఆర్పేందుకు ఎంత యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కొత్తవలస నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. అగ్నిప్రమాదంలో పశువుల పాకతో పాటు సుమారు 15 సెంట్లలో ఉన్న యూకలిప్టస్ చెట్లు కాలిపోయాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు దేముడు తెలిపారు.

విజయీభవ!

- నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలులో పరీక్ష కేంద్రం

తేదీ	పేపరు
17	తెలుగు
19	హిందీ
21	ఇంగ్లిష్
24	లెక్కలు
26	భౌతికశాస్త్రం
28	బయోలాజికల్ సైన్స్
31న	సోషల్

మాడుగుల రూరల్: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి రోజు విడిచి రోజు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయుల సూచనలతో విద్యార్థులు ప్రత్యేక ప్రణాళికతో సన్నద్ధమయ్యారు. మాడుగుల మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 710 మంది రెగ్యులర్, 73 మంది ప్రైవేటు విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్టు ఎంఈవో–2 బి.దేముడమ్మ తెలిపారు. మాడుగుల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 105 మంది రెగ్యులర్, 34 మంది ప్రైవేటు విద్యార్థులు, మాడుగుల జిల్లా పరిషత్ బాలికలు పాఠశాలలో 138, కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలులో 162 మంది రెగ్యులర్, ఏడుగురు ప్రైవేటు విద్యార్థులు, ఒమ్మలి జిల్లా పరిషత్ హైస్కూలులో 153 రెగ్యులర్, 29 మంది ప్రైవేటు విద్యార్థులు, తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల హైస్కూలులో 151 మంది రెగ్యులర్, ముగ్గురు ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, ఉదయం 9 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎం అందుబాటులో ఉంటారన్నారు. తాగునీరు, ప్రతి తరగతి గదికి విద్యుత్ సౌకర్యం కల్పించినట్టు చెప్పారు.


కొమరవోలులో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న సైన్స్ టీచర్ నాని

నాతవరం మండలంలో..

నాతవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు 415 మంది విద్యార్థులు రాయనున్నారని ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాతవరం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 257 మంది, డి.యర్రవరం హైస్కూల్‌లో 158 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. తాగునీటితో పాటు గదుల్లో విద్యుత్ లైట్లు వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రోలుగుంట: కొమరవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షలకు 60 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారికి హెల్పింగ్ పీపుల్ యూత్ అధ్యక్షుడు సామిరెడ్డి రామమూర్తి నాయుడు పరీక్ష సామగ్రిని సమకూర్చారు. వాటిని విద్యార్థులకు గ్రామానికి చెందిన రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ మాకిరెడ్డి నానీ పంపిణీ చేశారు.

వైభవంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఎస్.గజపతినగరంలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శిఖర, విగ్రహ ప్రతిష్ట అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తదితరులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తజనం తరలివచ్చి అమ్మవారి మహాప్రసాదాన్ని స్వీకరించారు. మహిళల కోలాటం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎం.అలమండలో పారిశుధ్య పనులు


ఎం.అలమండలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. స్థానిక సర్పంచ్ దాడి జగన్ ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పారిశుధ్య సిబ్బందితో గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్తా చెదారాలను, డ్రైనేజీల్లో పూడికను తొలగింపజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని సర్పంచ్ కోరారు. రోడ్లపై చెత్త వేయకుండా తడి, పొడి చెత్తలను ఇంటింటికి వచ్చే క్లాప్ మిత్రలకు అందించాలని సూచించారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం అలసత్వం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

కె.కోటపాడు: గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో చెరకు సభ్య రైతులు నష్టాల బారిన పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. కింతాడ పంచాయతీ శివారు రామచంద్రపురంలో పార్టీ మండల మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో రైతులు పెద్ద సంఖ్యలో చెరకు పంట సాగు చేస్తున్నారన్నారు. ఈ పంటను గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో క్రషింగ్‌ను చేయలేని పక్షంలో రైతులు పండించిన పంటను ఏమి చేసుకోవాలో ప్రభుత్వమే చెప్పాలని ఆయన కోరారు. గత క్రషింగ్ బకాయిలను ఫ్యాక్టరీ యాజమాన్యం నేటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు, జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు, పొంతపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

చెరకు సేకరణకు అందుబాటులో లారీ

సాక్షి ఎఫెక్ట్..


జె.నాయుడుపాలెం కాటా వద్ద లారీకి చెరకు లోడు చేస్తున్న రైతులు

రోలుగుంట: జె.నాయుడుపాలెం కాటా వద్ద చెరకు సేకరణ కోసం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆదివారం లారీని ఏర్పాటు చేసింది. 'కాటాల వద్ద ఎండిపోతున్న చెరకు' శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఫ్యాక్టరీ అధికారులు స్పందించారు. ఈ కాటా వద్ద గత వారం రోజులుగా బళ్లపై రైతులు సుగర్ ఫ్యాక్టరీ తరలించేందుకు చెరకు తీసుకొచ్చారు. అయితే చెరకు తరలించేందుకు వాహనాలు మాత్రం రాలేదు. దీంతో ఫీల్డ్‌మెన్‌లు ఇచ్చిన పర్మిట్లు మెరకు రైతులు తీసుకొస్తున్న బళ్ల సంఖ్య పెరగడం మినహా లారీలు మాత్రం రాలేదు. దీంతో కాటా వద్దే చెరకు ఎండిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాటా వద్దకు లారీ పంపడంతో రైతులు చెరకును ఆనందంగా లారీకి లోడు చేసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీల్లో వారం రోజుల్లో కంప్యూటరీకరణ పూర్తి


వడ్డాది కో–ఆపరేటివ్‌లో మాట్లాడుతున్న డీసీవో స్వరూపరాణి

బుచ్చెయ్యపేట: జిల్లాలో ఉన్న అన్ని కో–ఆపరేటివ్ సొసైటీలు వారం రోజుల్లోగా కంప్యూటరీకరణ పూర్తి చేయాలని డీసీవో స్వరూపరాణి తెలిపారు. ఆదివారం ఆమె వడ్డాది కో–ఆపరేటివ్‌లో రికార్డుల కంప్యూటరీకరణను ఆమె పరిశీలించారు. అనంతరం వడ్డాది, మాడుగుల, బంగారుమెట్ట తదితర సొసైటీల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైతులకు సులువుగా వేగవంతంగా రుణ సౌకర్యం కలిగేలా రికార్డులను కంప్యూటరీకరణ పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పలు సొసైటీల్లో కంప్యూటరీకరణ చివరి దశకు చేరగా.. మిగిలిన సొసైటీలు వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కిరణ్‌కుమార్, ఎస్.మురళి, మాడుగుల బ్రాంచ్ మేనేజర్ మహేశ్వరరావు, వడ్డాది సెక్రటరీ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో పూర్వ విద్యార్థుల సందడి


వడ్డాదిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బుచ్చెయ్యపేట: మండలంలోని మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు కుటుంబ విషయాలు, ఆర్థిక స్థితిగతులు గురించి వాకబు చేసుకున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థికి ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫీజు చెల్లిస్తానని పూర్వ విద్యార్థి మంచాల సత్తిబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పూర్తి విద్యార్థులు తలారి శంకరరావు, అడపా శ్రీను, దొండా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులోని మోదమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, తదితరులు ఈ పూజలు చేశారు. అమ్మవారికి పోతిన జగదీశ్, అప్పాన నాయుడు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు, చిరంజీవి, గణేశ్, ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయం నేరం


పెంటకోటలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

పాయకరావుపేట: నాటు సారా తయారీ, విక్రయం నేరమని ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు అన్నారు. పెంటకోటలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. సారా తయారు చేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. సారా సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. నాటు సారా వల్ల కలిగే దుష్ఫలితాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటు సారాకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వెలగా నారాయణరావు


మాడుగులలో శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘ సభ్యులు


చౌడువాడ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మావతి


కొత్తకోట గ్రంథాలయంలో..

నర్సీపట్నం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెదబొడ్డేపల్లి ట్యాంక్ బండ్ చెరువు గట్టుపై ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు బేతిరెడ్డి విజయ్‌కుమార్, కణితి వాసు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు క్లబ్‌ల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. వాసవీ కల్యాణ మండపం వద్ద ఉన్న శ్రీరాములు విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు వెలగా నారాయణరావు, జోగారావు, కృష్ణ తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. శాఖా గ్రంథాలయంలో శ్రీరాములు చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, పాఠకులు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్రావతరణ ఆద్యుడు శ్రీరాములు

మాడుగుల: ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఆద్యుడు పొట్టి శ్రీరాములని ఆర్య వైశ్య ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు అన్నారు. మాడుగులలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలుగు జాతి అభ్యున్నతి కోసం శ్రీరాములు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అంతకు ముందు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల, కింతలి, గాదిరాయి ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శ్రీరాములు విగ్రహానికి క్లబ్ అధ్యక్షురాలు పెనుగొండ శోభారాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

కె.కోటపాడు : చౌడువాడ శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి ఎం.పద్మావతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆకట్టుకునే విధంగా చిత్రాలను వేసిన విద్యార్థులకు బహుమతులను పద్మావతి అందజేశారు.

రుద్రభూమి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాకవరపాలెం: రుద్రభూమి అభివృద్ధి పనులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని తామరం శివారు కామేశ్వరీనగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధికి రూ.12 లక్షలు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టే పనులను ప్రారంభించారు.

నేడు దుర్గాభవానీ సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట

మాడుగుల రూరల్: మాడుగుల గ్రామంలో విజయ దుర్గా భవానీ అమ్మవారు, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం జరగనుంది. దుక్కా రమణారెడ్డి, సత్యవతి దంపతుల సంకల్పంతో ఉదయం 10.20 గంటలకు ఈ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకను విజయవంతం చేయాలని కోరారు.

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, ప్రసాదం అందజేశారు.

'ఉపాధి' బకాయి బిల్లులను చెల్లించాలి


వి.సంతపాలెంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : ఉపాధి వేతనదారులకు 11 వారాలకు సంబంధించిన బకాయి బిల్లులను అధికారులు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలో సూర్రెడ్డిపాలెం, వి.సంతపాలెం, వారాడ, ఆనందపురం, పోతనవలస, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎస్సీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సదుపాయం ఉన్నా వి.సంతపాలెం గ్రామంలో పలువురికి విద్యుత్ బిల్లులు పంపడం దారుణమన్నారు. సూర్రెడ్డిపాలెం చెరకు కాటా వద్దకు తీసుకువచ్చిన చెరకు 20 రోజులుగా అక్కడే ఉందన్నారు. చెరకు ఎండిపోవడం కారణంగా రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో తాళ్లపాలెం–వడపర్తి రోడ్డు


రెండు మండలాల సరిహద్దులో కొండగెడ్డపై నిర్మించిన వంతెన


రెండు మండలాలను కలిపే రహదారి

- రెండు మండలాలు కలుపుతూ రోడ్డు నిర్మాణ పనులు
- 20వ తేదీలోపు తారురోడ్డు వేసేందుకు చర్యలు
- నర్సీపట్నం పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఈశ్వరరావు

నాతవరం: రెండు మండలాలు సరిహద్దులో రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలో వల్సంపేట పంచాయతీ శివారు తాళ్లపాలెం నుంచి గొలుగొండ మండలం వడపర్తి మధ్య రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 40 లక్షలు మంజూరు చేసింది. ఈనిధులతో రెండు మండలాలు మధ్య పోంత రోడ్డును తారురోడ్డు నిర్మాణం చేస్తున్నారు.ప్రస్తుతం ముందుగా ఈ రోడ్డు పనులు మేటల్ వేసి రోలింగ్ వంటి పనులు చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే నాతవరం మండలంతో పాటు గొలుగొండ మండలాల్లో గ్రామాలకు దగ్గర దారి అవుతుంది. ఈనెల 20వ తేదీలోపు తారురోడ్డు వేసి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని నర్సీపట్నం పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఈశ్వరరావు తెలిపారు.

దంతాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సింహాద్రినాయుడు

దేవరాపల్లి: పదవీ విరమణ చేసి ప్రభుత్వ ఉద్యోగుల కోసం స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు యలమంచిలి విజ్జు డెంటల్ హాస్పిటల్ వైద్యుడు పి.సింహాద్రినాయుడు దంత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం జరిగిన పెన్షనర్ల సమావేశంలో డెంటల్ వైద్యుడిని పింఛన్‌దారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు ఆదిరెడ్డి చినకన్నబాబు, ఆదిరెడ్డి చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.